ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బర్కత్‌పుర చమాన్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ వాడకం, ట్రిబుల్ రైడింగ్, పెండింగ్ చాలన్లపై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ చలాన్లు సకాలంలో చెల్లించాలని సూచించారు. కుటుంబసభ్యులను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని విజ్ఞప్తి చేశారు. - కాచిగూడ

శుభాకాంక్షలు

సుల్తాన్‌బజార్, మే 22 : ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఐఏఎస్ దానకిశోర్‌ను బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా,ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, యూజీసీ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, ఓయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొ. రాజేందర్ నాయక్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భవన్స్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

నేరేడ్‌మెట్,మే 22: భవన్స్ వివేకానంద కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్స్ కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని భవన్స్ వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జిఎస్‌విఆర్‌కె. చౌదరి తెలిపారు. బుధవారం భవన్స్ కళాశాల ఆవరణలో వివరాలు వెల్లడించారు. 2024-25 అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివి..

- ఓయూలో ఘనంగా భాగ్యరెడ్డివర్మ జయంతి
- దళితుల్లో చైతన్యం నింపిన గొప్ప సంఘసంస్కర్త

భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 22: జీవితమంతా దళితుల అభ్యున్నతికి కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతిని ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్(అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సైదులు మాట్లాడుతూ.. భాగ్యరెడ్డివర్మ నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు. నగరంలో ఆది ఆంధ్రసభ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ సంస్థలను స్థాపించి తెలంగాణ వైతాళికుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాదులు వేశారని గుర్తుచేశారు. దేశంలో దళిత చైతన్యానికి నాంది పలికిన మహానుభావుడు భాగ్యరెడ్డివర్మ అని ప్రశంసించారు. ఉద్యమకారుడిగా, హక్కుల కార్యకర్తగా, రచయితగా, పాత్రికేయుడిగా, సంఘసంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞాశీలిగా సేవలందించారని పేర్కొన్నారు. తెలంగాణలో జోగిని, దేవదాసి వంటి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించారని కీర్తించారు. బహుజనులే ఆది హిందువులని, ఈ విషయాన్ని అంబేద్కర్ కంటే ముందుగానే భాగ్యరెడ్డివర్మ పేర్కొన్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎన్ఎం శ్రీకాంత్‌యాదవ్, ఉదయ్, గోపి, బసవరాజు, శ్రీను, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి తలసాని పూజలు

జీరాలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ మే 22: లక్ష్మీనర్సింహస్వామి అశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆకాంక్షించారు. శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి జయంతి సందర్భంగా బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ జీరాలోని పురాతన లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, నిర్వాహకులు నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

మేడ్చల్ కలెక్టరేట్, మే 22: కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎంవీ భాగ్యరెడ్డి వర్మ జయంతిని బుధవారం నిర్వహించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి.వినోద్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తాం..

సర్ఫన్ సబేర్‌కు చెక్కు అందజేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, మే 22: పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందజేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ ఆఫీస్‌లో బుధవారం మల్కాజిగిరి డివిజన్ కృకాపాంప్లెక్స్‌కు చెందిన సర్ఫన్ సబేర్ సీఎంఆర్ఎఫ్ నుంచి వారి చికిత్స కోసం రూ.1.50లక్షలు మంజూరు కాగా ఆ పత్రాలను ఎమ్మెల్యే వారికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, జేఏసీ వెంకన్న, రాముయాదవ్, వెంకటేష్‌యాదవ్, శ్రీకాంత్, మణిరత్నం, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్‌కు ఘన సన్మానం

ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 22: పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించి, తిరిగి ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిన ప్రొ. లక్ష్మీకాంత్ రాథోడ్‌ను బుధవారం అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. దేశంలోనే తొలిసారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నుంచి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఘనత ప్రొఫెసర్ రాథోడ్ సొంతం చేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాజేశ్‌కుమార్, సత్యనారాయణ, దీప్లా, డాక్టర్ జగన్మోహన్, ఉద్యోగులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖన పోటీలు

టీజీపీసీబీ ఆడిటోరియంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అమీర్‌పేట్, మే 22 : అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంలో భాగంగా సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ కేంద్ర కార్యాలయంలో బుధవారం బాలబాలికలకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. టీజీపీసీబీ ఆడిటోరియంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొక్కలు నాటడం ద్వారా భూమిని వివిధ రకాల కాలుష్యం నుంచి ఏ విధంగా పరిరక్షించుకోగలం, నీటి వనరుల సంరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడం, జీవవైవిధ్య పరిరక్షణ.. అనే అంశాలపై విద్యార్థులు గీసిన చిత్రాలు ఆలోచింపజేశాయి. జీవ వైవిధ్య దినోత్సవం జూన్ 5న ఎంపిక చేసిన చిత్రాల విజేతలకు బహుమతులు అందజేస్తామని సంస్థ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ తెలిపారు.

రెయిన్‌బో హోమ్‌లో పుట్టిన రోజు వేడుకలు

రోయిన్‌బో హోమ్‌లో చిన్నారులతో కలిసి పుట్టిన రోజు జరుపుకున్న మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్, పాల్గొన్న నాయకులు

సికింద్రాబాద్, మే 22: సీతాఫల్‌మండి డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్ బుధవారం తన పుట్టిన రోజు వేడుకలను రెయిన్‌బో హోమ్‌లోని చిన్నారుల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా బీజేపీ నాయకుడు ఆకారపు రమేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం చిన్నారులకు పండ్లు, జ్యూస్ పంపిణీ చేశారు. అదేవిధంగా జామై ఉస్మానియా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

వైభవంగా తేనె లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

ఉప్పల్, మే 22: ఉప్పల్ బీరప్పగడ్డలోని తేనె లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కల్పించారు. కల్యాణం సందర్భంగా స్వామివాకి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, శ్రీనివాస్, సామల నాగరాజు, మాడిషెట్టి సత్యనారాయణ,ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆటపాటలు అవసరం

కార్యక్రమంలో మాట్లాడుతున్న చొక్కాపు వెంకటరమణ

చిక్కడపల్లి, మే 22 : తెలంగాణ బాలోత్సవం సందర్భంగా 18 రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చొక్కాపు వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఆట స్థలాలు లేవని, ఇరుకు గదుల్లో చదువు తన్నారన్నారు. దీంతో చిన్నారులు ఆటపాటలకు దూరం అవుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొయ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పిల్లలు అన్నిరంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహం, సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య, ఉపాధ్యక్షురాలు సుజాత, మమత, పద్మ, జి.బుచ్చిరెడ్డి, నవీన్, గోపాల్, భవాని, మానస పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, మే 22 : చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి పూజలు చేశారు. కార్యనిర్వహణాధికారి కె.రామాంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడి కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్ కార్యక్రమాలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు 31 వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 26న స్వామి వారి కల్యాణం, 27న రాత్రి స్వామి వారి గరుఢ వాహన సేవ, 28 శ్రీ స్వామివారి శృంగార రథోత్సవం, 30న శ్రీ స్వామివారి అభిషేకం, 30న స్వామివారి శృంగార డోలోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

'చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు'

పాన్‌షాపు యాజమానులకు సూచనలు చేస్తున్న కాచిగూడ ఏసీపీ రఘు

కాచిగూడ, మే 22 : చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని కాచిగూడ ఏసీపీ వి.రఘు హెచ్చరించారు. పీఎస్ పరిధిలోని పాన్‌షాపు యాజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏసీపీ రఘు మాట్లాడుతూ.. పాన్‌షాపు యాజమానులు నిషేధిత గుట్కాలు, మత్తు సిగరెట్టు, చాక్లెట్లు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపులు రోజు రాత్రి 11 గంటలకు మూసివేయాలని సూచించారు. కార్యక్రమంలో కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి..

బేగంపేట, మే 22: ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. అదుపు తప్పి కింద పడిన ఓ మహిళ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం నెక్లెస్ రోడ్డు సెక్రటరియట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. బేగంపేట రసూల్‌పుర నివాసి ఫాతిమా, ఫయాజ్ దంపతులు. వీరిద్దరు కలిసి సోమవారం నెక్లెస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పి ఎగిరిపడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఫాతిమాను ఆస్పత్రిలో చేర్చించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : అసదుద్దీన్

ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ బుధవారం అసదుద్దీన్ ఒవైసీని కలిసి పెండింగ్ అభివృద్ధి పనుల వివరాలు తెలిపారు. - మెహిదీపట్నం

యువకుడు అదృశ్యం

శేరిలింగంపల్లి, మే 22 : ఇంటి నుంచి ఆఫీస్‌కు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చాంద్రాయణగుట్ట ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫజలుద్దీన్ నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వేవ్‌రాక్ ఐటీ పార్కు బిల్డింగ్‌లోని బిర్లా సాఫ్ట్ వేర్ కంపెనీలో సీసీటీవీ సర్వీస్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లిన ఫజలుద్దీన్ రాత్రి 9 గంటలకు తిరిగి రాలేదు. ఆఫీస్‌లో విచారించగా వెళ్లిపోయాడని తెలిపారు. బుధవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిలిచిన పార్శీగుట్ట రోడ్డు పనులు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

తవ్వి వదిలేసిన పార్శీగుట్ట - రాంనగర్ రోడ్డు

ముషీరాబాద్, మే 22 : ముషీరాబాద్ డివిజన్ రాంనగర్ - పార్శీగుట్ట రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా వేసి కొద్ది దూరం తవ్వి వదిలివేయడంతో పార్శిగుట్ట మార్గంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతున్నది. మూడు నెలల క్రితం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రూ. 70 లక్షల వ్యయంతో రాంనగర్ - పార్శీగుట్ట మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. తొలుత రోడ్డు నిర్మాణ పనుల వేగంగా చేపట్టిన అధికారులు ఆ తర్వాత స్థానికులు డ్రైనేజీ పైపులైన్ పూర్తయ్యే వరకు రోడ్డు నిర్మాణం ఆపాలని కోరడంతో పనులు కొద్ది రోజులు నిలిచిపోయాయి. పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాల్సిన గుత్తేదారు నత్తనడకన పనులు చేపడుతున్నారు. ఇటీవల పార్శీగుట్ట శ్మశాన వాటిక నుంచి రాంనగర్ బ్రహ్మాంగారి టెంపుల్ కమాన్ వరకు తవ్విన గుత్తేదారు కొంత దూరం వదిలి రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డంతా వేసి కొద్ది దూరం వదిలిపెట్టడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద ఎత్తున తవ్విన గుంతలో నుంచి వెళ్లడానికి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

గుత్తేదారుల సమ్మె కారణంగా ఆలస్యం..

బిల్లులు చెల్లించాలంటూ గుత్తేదారులు సామూహికంగా పనులు చేపట్టకపోవడం వలన పార్శీగుట్ట రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎన్నికల పోలింగ్ బూత్ ఉన్న సెయింట్ పాయిస్ స్కూల్ మార్గంలో తాత్కాలికంగా పనులు నిలిపివేశాం. త్వరలోనే మిగతా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.

- మురళి, ఏఈ జీహెచ్ఎంసీ సర్కిల్ - 15

సన్మానం

టీఎన్జీవో కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశం నిమిత్తం నగరానికి విచ్చేసిన టీఎన్జీవో ఆదిలాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్.అశోక్, కార్యదర్శి నవీన్, నిర్మల్ జిల్లా శాఖ అధ్యక్షుడు వి. ప్రభాకర్, కార్యదర్శి ఎన్.రవికుమార్‌ను బుధవారం తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘం భవనంలో అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘం గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బిన్ హసన్, నగర శాఖ కార్యదర్శి జి.శ్రీనివాస్, నాయకులు బి.రాజేందర్, సయ్యద్ ఖలీల్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. - సుల్తాన్‌బజార్

నర్సుల దినోత్సవం..

మియాపూర్, మే 22 : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పటల్‌లో బుధవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ మమతా రఘువీర్ మాట్లాడుతూ.. నర్సుల వృత్తి ఎంతో పవిత్రమైనదని రోగులకు ఎన్నో సేవలందించి వారు ఆరోగ్య పరంగా స్వస్థత పొందేలా కృషి చేస్తారన్నారు. నేటి పరిస్థితుల్లో మహిళలు ఎంతో వత్తిడికి గురవుతున్నారని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం నర్సులను సన్మానించారు. కార్యక్రమంలో హాస్పటల్ చైర్మన్ డాక్టర్ రామచంద్ర,ఎండీ డాక్టర్ తుషార, కామాక్షమ్మ, ఇతర వైద్యులు, సిబ్బంది, నర్సులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మన్సూరాబాద్, మే 22: అధికారులు సమన్వయంతో పని చేస్తూ వర్షాకాలంలో తలెత్తే సమస్యలను పరిష్కరించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతమైన ఆగమయ్యకాలనీలో బుధవారం పర్యటించి ఇటీవల కురిసిన వర్షాల వలన తలెత్తిన వరద ముంపు సమస్యను ఆయన పరిశీలించారు. ఆగమయ్యకాలనీ, గణేశ్‌నగర్‌లో చిన్న వర్షానికే ముంపు ఏర్పడుతుందని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు.

ప్యారడైస్ సర్కిల్‌లో యూకో బ్యాంక్ ప్రారంభం

- మెరుగైన సేవలందించేందుకు కట్టుబడి ఉన్నామన్న డీజీఎం ఎన్.శ్రీకాంత్



యూకో బ్యాంక్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డీజీఎం ఎన్.శ్రీకాంత్

జూబ్లీహిల్స్, మే 22: యూకో బ్యాంక్ కస్టమర్ సేవలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని.. తక్కువ వడ్డీ రేట్లలో సాధారణ ప్రజలకు అనేక ఆకర్షణీయమైన పథకాలు అందుబాటులో ఉన్నాయని బ్యాంక్ డీజీఎం, హైదరాబాద్ జోనల్ హెడ్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు.

స్వాతంత్ర్యానికి పూర్వం 1945 నుంచి సికింద్రాబాద్ రాణిగంజ్‌లో కొనసాగుతున్న ఎంజీ రోడ్ బ్రాంచ్‌ను వినియోగదారుల సౌలభ్యం కోసం హైదరాబాద్‌లో విశాలమైన ప్రాంగణంలోకి మార్చడం సంతోషకరమని ఆయన తెలిపారు. బుధవారం నగరంలోని ప్యారడైస్ సర్కిల్ బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్‌లోకి మార్చిన యూకో బ్యాంక్ నూతన ప్రాంగణాన్ని డీజీఎం ఎన్.శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అభివృద్ధి చెందుతున్న ప్రభుత్వరంగ బ్యాంక్‌ల్లో ఒకటైన యూకో బ్యాంక్ హైదరాబాద్ నగరంలో వినియోగదారులకు మరింత అందుబాటులో ఉండేందుకు ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

గోవా మెగా చాంపియన్‌షిప్ కరాటే టైటిల్ విన్నర్‌లుగా రవి, రాకేశ్

కేపీహెచ్‌బీ కాలనీ, మే 22 : గోవాలో జరిగిన యూనివర్సల్ 369 గోవా మెగా చాంపియన్‌షిప్ ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో కూకట్‌పల్లికి చెందిన రవి అండ్ రాకేశ్ టైటిల్ విన్నర్‌లుగా నిలిచారు. బుధవారం గోవాలో జరిగిన ఫైనల్ పోటీల్లో హైదరాబాద్‌లోని నీయుధాలీ మార్షల్ అకాడమీకి చెందిన రవి, రాకేశ్‌లు బ్లాక్ బెల్ట్ విభాగంలో టైటిల్ విన్నర్‌లుగా నిలిచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 16 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా... రాష్ట్రం నుంచి బరిలో దిగిన రవి, రాకేశ్‌లు తుది విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కోచ్‌లు సంతోష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ... ఈ ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలను సాధించడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించి గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని అభినందించారు.